క్లుప్తంగా

పెండింగ్ కేసులను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్

మణుగూరుటౌన్: పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదిస్తూ నేరాలను నియంత్రిస్తూ కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం మణుగూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులకు కేసుల ఇన్వెస్టిగేషన్‌లో తగిన సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (మణుగూరు) సతీష్ కుమార్, (అశ్వాపురం) అశోక్, ఏడూళ్లబయ్యారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రాజ్‌కుమార్, కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్, అశ్వాపురం ఎస్‌ఐ తిరుపతిరావు, సంబంధిత రైటర్లు సిబ్బంది ఉన్నారు.

బైక్ ర్యాలీ..

అశ్వారావుపేటరూరల్: బీజేపీ శ్రేణులు శనివారం అశ్వారావుపేటలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్, పొట్టిశ్రీరాముల సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా జంగారెడ్డిగూడెం మార్గం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గొట్టిపుల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, ప్రశాంత్, శంకర్, మద్దాల దేవి, జల్లిపల్లి అరవింద్, యశోద కల్యాణ్, శ్రావణ్‌కుమార్, మణికంఠ, సుబ్బారావు, అప్పారావు పాల్గొన్నారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం పాఠశాల విద్యార్థులకు సాయంత్రపు సమయంలో సమయానుకూలంగా బస్సును ఏర్పాటు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ మండల ఇన్‌చార్జ్ కొప్పుల నారాయణ ఆర్టీసీ సూపరింటెంట్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా నరసాపురం విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించి ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. సమయానుకూలంగా బస్సు ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్, భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతును ఆదుకోవాలి

చండ్రుగొండ: నష్టపోయిన మిర్చి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రావికంపాడుకు చెందిన రైతు ఇమ్మడి శ్రీనుకు చెందిన మూడు ఎకరాల మిర్చితోటపై విషప్రయోగం జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు శనివారం వడలిపోయిన తోటను పరిశీలించిన రైతుకుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే తోపాటు మంత్రులను కలిసి బాధితుడిని ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దార వెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, మెడా మోహన్ రావు, రైతులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

దుమ్ముగూడెం: మండలంలో ఆటో కార్మికులు చేస్తున్న సమ్మెకు బీఆర్ఎస్ మండల కమిటీ సంఘీభావంగా మద్దతు తెలియజేసింది. తూరుబాక గ్రామంలో బంద్ చేస్తున్న ఆటో కార్మికులకు స్థానిక నాయకులు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీ పాషాలు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్ సౌకర్యంతో ఆటో కార్మికులకు కిరాయిలు దొరక్క పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికిచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. నాయకులు పార్టీ దామెర్ల శ్రీనివాస్, వాగే కృష్ణ, జిలకర గంగరాజు, ఆటో యూనియన్ నాయకులు కొమరం లింగరాజు, అజీమ్, దేగల చంటి, జల్లరపు రమేష్, మట్ట జోగయ్య, జలగం కొల్లు, శ్రీనివాస్ గౌడ్,నాగేశ్వరరావు, పసుపులేటి రవి పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అయ్యప్ప కాలనీ ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌ను శనివారం కలిసి ఇంటింటి సర్వే గురించి తెలిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలే కొందరు రెవెన్యూ అధికారులు తమ కాలనీలో పర్యటించి ఇళ్లను ఖాళీ చేయాలని హెచ్చరించిన్నట్లు పేర్కొన్నారు. కాలనీ మొత్తానికి ఎక్కడైన ఒకే చోట ఇళ్లు నిర్మించి ఇస్తే ఖాళీ చేయడానికి సిద్ధమని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సమస్యను పరిష్కారించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్లలో నిధులు

- నిర్మాణ దశలో పనులు
- సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మణుగూరుటౌన్: వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పక్కన నాయికులు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని, ఇచ్చిన హామీల్లో ఎక్కువ మేర అమలుచేశామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. అంతేకాక నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్లలో నిధులు సాధించానని వెల్లడించారు. మణుగూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు సాధించగా, అవన్నీ నిర్మాణంలో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇంకొన్ని టెండర్ల దశలో ఉన్నాయని చెప్పారు. పీఆర్ విభాగంలో 633 పనులకు రూ.53.32 కోట్లు మంజూరు చేయించగా బీటీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. తరగతి గదులు, పాత భవనాల మరమ్మతులకు రూ.57.37 కోట్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనులకు ఐటీడీఏ నుంచి రూ.39.52 కోట్లు, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్వహణకు రూ.10కోట్లు, చెక్ డ్యాంలు, లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు రూ.89.30 కోట్లు విడుదల చేయించగా, 16వేల ఎకరాల సాగు నీరు అందించేందుకు మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టామని తెలిపారు. అలాగే, ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు రూ.80 లక్షలు, ఐటీసీ, సింగరేణి నుంచి వివిధ పనులకు రూ.15 కోట్లు మంజూరు చేయించగా పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యాన రూ.9.30 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని, మణుగూరు మున్సిపాలిటీకి మంజూరైన రూ.40కోట్లతో భగత్‌సింగ్‌నగర్‌లో వాటర్ ట్యాంక్, కట్టువాగు, మెట్టువాగుల్లో పూడికతీత పనులు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు మరమ్మతు చేయించామని తెలిపారు. వరదలతో నష్టపోయిన 2వేల కుటుంబాలకు రూ.16,500 చొప్పున రూ.4.29కోట్లు, పంట నష్టపోయిన వారికి రూ.2 కోట్ల పరిహారం మంజూరు చేయించామని చెప్పారు. అలాగే, మణుగూరు, కృష్ణసాగర్ ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. ఇవి కాక పులుసుబొంత ప్రాజెక్టు, బీటీపీఎస్ రైల్వే ట్రాక్‌లో భూమి కోల్పోయిన వారికి పరిహారం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తి, బీటీపీఎస్ వైపు నాలుగు లేన్ల రహదారిని ప్రతిపాదించగా, మున్సిపాలిటీని పంచాయతీగా మార్చే అంశంపై చర్చిస్తున్నామని పాయం తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు శివ సైదులు, నాగేశ్వరరావు, సూరపనేని తరుణ్‌రెడ్డి, కొర్సా ఆనంద్, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్, వీరంకి వెంకట్రావు, గోరంట్ల కనకయ్య, గణేశ్‌రెడ్డి ఉన్నారు.

చెక్కుల పంపిణీ..

బూర్గంపహాడ్: ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో శనివారం ఎమ్మెల్యే పాయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీల ద్వారా డ్వాక్రా మహిళలకు రూ.6.77 కోట్లు చెక్కులు పంపిణీ చేశారు. అనంతర 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



భద్రాచలంటౌన్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

భద్రాచలంటౌన్: ప్రభుత్వం అందిస్తున్న చేయుతతలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక గిరిజన అభ్యుదయ భవన్‌లో శనివారం జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్న ఆయన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చర్ల మండల మహిళా సమాఖ్య సంఘాలకు రూ.2 కోట్ల రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో స్వయం ఉపాధి, సామాజిక ఎదుగుదల, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల సమాఖ్య పాలక వర్గ సభ్యులు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

భద్రాచలం పట్టణంలోని మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలు ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

దమ్మపేట: మహిళలు స్వశక్తిపై నిలబడి, ఆర్థిక స్వావలంబన సాధించాలని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని దమ్మపేట, మందలపల్లి, వడ్లగూడెం, గట్టుగూడెం, నాచారం, నాగుపల్లి, గుత్తవారిగూడెం గ్రామాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు, ఐకేపీ వారి సౌజన్యంతో బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన వ్యాపార యూనిట్లను, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల విలువైన చెక్కును అధికారుల సమక్షంలో అందజేశారు. అనంతరం స్థానిక గిరిజన గురుకులంలో సీఎం కప్ గ్రామ స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, దిశ కమిటీ సభ్యురాలు ఏసుమణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, ఐకేపీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని 22 స్వయం సహాయక సంఘాలకు రూ. 2.30 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో జానకీపురం, రాజాపురం గ్రామాల్లో పుట్టగొడుగుల పెంపకం యూనిట్‌లను ఆయన పరిశీలించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మద్రిగూడెం–రాజాపురం గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సత్వరమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఏపీఎం సంతోష్‌కుమార్, నాయకులు పర్సా వెంకట్, భీమిరెడ్డి వెంకట్రావిరెడ్డి, దుబాకుల రాము, పోట్రు వెంకటేశ్వరరావు, వేముల రమణ, శివ పాల్గొన్నారు.



దమ్మపేట: స్వయం సహాయక సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

అడవిలో నిప్పు పెడితే కఠిన చర్యలు



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

చండ్రుగొండ: అడవిలో నిప్పు కాల్చితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు హెచ్చరించారు. చండ్రుగొండ ఫారెస్ట్ రేంజి పరిధిలోని మద్దుకూరు సెక్షన్ కంపార్ట్‌మెంట్‌లో చేపట్టిన ప్లాంటేషన్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అడవిలో నిప్పు పెడితే జరిగే పరిణామాలను ఆయన వివరించారు. అడవుల్లో నిప్పు పెట్టకుండా అన్ని గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. అక్రమంగా పోడు నరకరాదని ఇకపై పోడు నరికితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సెక్షన్ అధికారులు అమరేందర్‌సింగ్, రామకృష్ణ, బీట్ అధికారి భాస్కర్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రకళా పోటీలు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట కాంప్లెక్స్ స్థాయిలో విద్యార్థులకు చిత్రకళా పోటీలను శనివారం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో 24 మంది విద్యార్థులు హాజరు కాగా, ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హర్షిత (ప్రథమ బహుమతి), సీహెచ్.సాయిలక్ష్మి తేజశ్రీ (ద్వితీయ బహుమతి), సీహెచ్.విష్ణు (తృతీయ బహుమతి) సాధించారు. అనంతరం విజేతలకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

మణుగూరురూరల్: గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్‌లు పిలుపునిచ్చారు. శనివారం కూనవరం గ్రామపంచాయతీ పీవీకాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నూకారపు రమేష్, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, అక్కి నర్సింహరావు, ఆవుల నర్సింహరావు, మాజీ సర్పంచ్‌లు కాటిబోయిన సుజాత, మచ్చా సమ్మక్క, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్, వల్లభనేని రమణ, కలగూర శంకర్, మడి వీరన్న బాబు, రామారావు, సురేష్, మూసా తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

మణుగూరుటౌన్: మండలంలోని ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న మద్దులగూడెం అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఏకరూప దుస్తులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి, సూపర్‌వైజర్లు సుశీల, హైమావతి, పద్మ, భద్రమ్మ, రాజమణి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు తదితరులు ఉన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

చర్ల: ఆదివాసీలు, గిరిజనులపై ప్రభుత్వం చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల జీవనాధారామైన పోడు భూములను ప్రభుత్వం లాక్కుంటూ ప్లాంటేషన్లు చేస్తోందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ గ్రామలపై దాడులు చేయిస్తూ ఆదివాసీ గ్రామాల నుంచి వారిని వెళ్లగొట్టేందుకు యత్నిస్తోందని, ఇది ఏ మాత్రం సరైంది కాదని ఆయన అన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుపాకుల నాగేశ్వరావు, నాయకులు ముయ్యన్న, శ్రవంతి, స్వరూప్ పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రథమం

దుమ్ముగూడెం: ప్రజలకీ హామీ ఇచ్చినట్లుగా సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ప్రథమంగా ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మలు అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుడు తాత మధు మండలానికి, భద్రాచల డివిజన్‌కి ఎన్ని నిధులు తీసుకొచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావును విమర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ మట్ట శివాజీ, చందు,అయ్యప్ప రెడ్డి శ్రీధర్, కెల్లాశేఖర్, దర్శి సాంబశివరావు, కోడి చంటి, శివరావు, గెడ్డంబాలాజీ, బత్తుల శోభన్, లంక ప్రసాద్, శ్రీను, రాజు, సీతారామరావు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామానికి చెందిన జర్నలిస్ట్ పర్శబోయిన రాధాకృష్ణ తండ్రి లక్ష్మయ్య దశదినకర్మల కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం హాజరయ్యారు. లక్ష్మయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, సదర్‌లాల్, తూము వీరరాఘవులు, రాగం మల్లయ్య, రాము, కంట్లమయ్య పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపండి

ములకలపల్లి: గ్రామపంచాయతీ ఎన్నికల ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితా ఖరారు చేసినట్లు ఎంపీడీఓ జి.రేవతి తెలిపారు. ఈమేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంతోపాటు, మండల పరిధిలోని 20 జీపీ కార్యాలయాల్లో జాబితాను అంటించారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీలోగా తెలియపరచాలని ఆమె సూచించారు.

ఈజీఎస్ ఓపెన్ ఫోరం

ములకలపల్లి: ఉపాధి హామీ ఓపెన్ ఫోరం సాదాసీదాగా సాగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీడీఓ రేవతి అధ్యక్షతన 16వ విడత సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. గడచిన ఏడాది కాలంలో ఉపాధి హామీ పథకంలో మండలంలోని 20 జీపీల పరిధిలో 6,88,69,625 పనులు చేశారు. తనిఖీ బృందం గుర్తించిన అంశాలను మండల సభలో సమగ్రంగా వివరించారు. సంవత్సర కాలంలో చేసిన పనులకు సంబంధించి రూ.28 వేలు రికవరీ, రూ 15 వేలు పెనాల్టీ విధించినట్లు అధికారులు ప్రకటించారు. అడిషినల్ డీఆర్‌డీఓ ఎస్.రవి, డీవీఓ రమణ, అంబుడ్స్‌మెన్ నాగప్రకాశ్, జేక్యూసీఓ అనిల్, ఈజీఎస్ ఏపీఓ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీప్రణయ్‌కు సన్మానం

మణుగూరురూరల్: ఇటీవల హైద్రాబాద్‌లో జరిగిన సీఎం కప్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలో ట్రైల్ విభాగంలో కరకగూడెం మండలానికి చెందిన గొగ్గలి లక్ష్మీప్రణయ్ ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచి వెండి పతాకాన్ని సాధించాడు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును లక్ష్మీప్రణయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది

పినపాక: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రపరిచారు. తడి చెత్త, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రతి వారాంతకులు ఒకరోజు పరిసరాలను శుభ్రపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


మణిపూర్ ఆదివాసులకు రక్షణ కల్పించాలి

భద్రాచలంటౌన్: మణిపూర్‌లో మళ్లీ హింసలకు కారణం బీజేపీ దొంగ విధానాలనే అని, అక్కడి ఆదివాసులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన గిరిజన సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ పాలనలో జాతి ఘర్షణలు జరిగి పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆరోపించారు. సమస్యను పరిష్కరించలేని అక్కడి ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కారం పుల్లయ్య, సున్నం గంగ, మడివి రమేష్, పాయం నరసింహారావు, జోగారావు, శ్రీను, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని నామవరం గ్రామంలు వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్టీ పురస్కరించుకుని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కొండాయిగూడెం గోదావరి నది తీరంలో ఉన్న వైద్యనాథ లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణ క్రతువును శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రతువులో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి దంపతులు పాల్గొని స్వామి వార్లకు పూజాది కార్యక్రమాలు చేశారు. భక్తులు సైతం అధికంగా తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అన్నపురెడ్డిపల్లి: స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం సుబ్రమణ్యస్వామి షష్టి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు.

ప్రశంసా పత్రం అందజేత



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

దమ్మపేట: వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చూపిన విద్యార్థినికి ఎస్పీ రోహిత్‌రాజు ప్రశంసా పత్రం అందజేశారు. గత అక్టోబరు 21న పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా 'మొబైల్ ఫోన్ల వాడకం ఉపయోగాలు, అనర్థాలు' అనే అంశంపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో దమ్మపేటకు చెందిన వనమాల యువతేశ్వరి (8వ తరగతి) ఉత్తమ ప్రదర్శన కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం యువతేశ్వరికి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు దీక్ష

గుండాల: పర్యావరణ పరిరక్షణ కోసం ఏక భుక్త (ఒంటి పూట భోజనం) దీక్ష చేస్తున్నట్లుగా డబ్ల్యూఈఓ తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ కోఆర్డినేటర్, జాకారం మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మహమూద్ పాషా తెలిపారు. ఈ నెల 8 నుంచి జనవరి 16 వరకు ఈ దీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు. జనహిత పర్యావరణం కోసం అందరి సహకారంతో దీక్షకు పూనుకున్నట్లు ఆయన వెల్లడించారు.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ

భద్రాచలంటౌన్: భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక కోసం శనివారం గ్రామ సభను తహసీల్దార్ శ్రీనివాస్ నిర్వహించారు. మండలం నుంచి మొత్తం 110 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్‌కు నివేదిక పంపిన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, గ్రామ సభను రెవెన్యూ అధికారులు రహస్యంగా నిర్వహించారని, ఉదయం 8 గంటలకు ప్రారంభించిన గంటలో పూర్తి చేసి గప్‌చుప్ చేశారని ఆరోపిస్తూ పట్టణంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి చెరుకుని ఆందోళన నిర్వహించారు. గుటుచప్పుడు కాకుండా గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ నింబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు.

ఇళ్లస్థలాల పరిశీలన

చండ్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయతీ జర్పులతండాలో ఇళ్లస్థలాల కోసం భూమిని కొత్తగూడెం ఆర్డీఓ మధు పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన 14 మంది గిరిజనుల ఇళ్లు రైల్వే లైన్ నిర్మాణంలో పోయాయి. అయితే వారికి ప్రభుత్వం తరుపున పరిహారం చెల్లించారు. ఇళ్లస్థలంతోపాటు వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన స్థలాన్ని పరిశీలించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్రసర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్‌ఐ అక్బర్, సర్వేయర్ ధర్మరాజు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం



బూర్గంపాడు: పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బూర్గంపహాడ్: ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా శనివారం సీఎం కప్ కబడ్డీ పోటీలు బూర్గంపహాడ్ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను మండల తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలా రెడ్డి, ఎంపీఓ సునీల్ శర్మ, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమల రెడ్డిలు కబడ్డీ ఆడి విద్యార్థులను ఉత్తేజ పరిచారు.

దుమ్ముగూడెం: మండలంలోని కోయ నర్సాపురం గ్రామపంచాయతీ పరిధిలోని యువతకు సీఎం కప్ క్రీడా పోటీలను పంచాయతీ కార్యదర్శి మైరూన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్లూరి జయ బాబు శనివారం ప్రారంభించారు. వాలీబాల్, కబ్బడీ, ఖోఖో, రన్నింగ్ తదితర క్రీడాలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి పోటీలు ఉపయోగపడుతాయని ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి, హెచ్‌ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ పెద్దలు కొర్స గంగరాజు, తెల్లం రామకృష్ణ, తెల్లం రాజేష్, నూప వెంకటేష్, రాజబాబు, సోందె రమేష్, నూప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికలు..

చండ్రుగొండ: సీఎం కప్ కోసం పంచాయతీల వారిగా క్రీడాకాలను శనివారం ఎంపిక చేశారు. స్థానిక సెయింట్‌జోసఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు ప్రారంభించారు. అండర్-14, అండర్-19 విభాగంలో వాలీబాల్, అండర్-20 విభాగంలో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల కోసం ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులతో పంచాయతీ స్థాయిలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు క్రీడాపోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, డీటీ ప్రసన్న, ఫిజికల్ డైరెక్టర్ సృజన, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెంట్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: గ్రామస్థాయి 'సీఎం కప్' క్రీడా పోటీలను శనివారం తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానిక గుడ్ న్యూస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, కబాడ్డి, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి కే శ్రీరామమూర్తి, పీడీ సున్నం రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.